క్లుప్తంగా

రంజాన్ ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ వేణు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలో గురువారం నిర్వహించనున్న రంజాన్ పర్వదిన వేడుకల ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వేణు బుధవారం పరిశీలించారు. వైరా రిజర్వాయర్ సమీపంలోని ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్ అక్కడ శుభ్రం చేయించి షామియానాలు ఏర్పాటు చేయించాలని సిబ్బందికి సూచించారు. తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న సత్తుపల్లి డీఎం రాజ్యలక్ష్మి

పెనుబల్లి: వీయంబంజర్ బస్టాండ్ ఆవరణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిలో ప్రయాణీకుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన పట్టణ ఆర్యవైశ్య సంఘ సభ్యులను అభినందించారు. పట్టణ కమిటీ ప్రయాణీకులకు మూడు నెలల పాటు చల్లటి మినరల్ వాటర్ అందజేయనున్నట్లు అధ్యక్షుడు కొదుమూరి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కల్యాణ మండపం అధ్యక్షుడు మిట్టపల్లి నరేంద్రకుమార్, కొదుమూరి వీరభద్రం, దారా సుధాకర్, సూరే దుర్గాప్రసాద్, ఆదిత్య, ఎస్ఎం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న అమర్లపూడి శరత్

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు అమర్లపూడి శరత్ కోరారు. బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఐదు నెలలుగా సిబ్బందికి వేతనాలు ఇవ్వక పోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్మికులకు వేతనాలు పెంచటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఎన్నిసార్లు జిల్లా అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వెంటనే కార్మికులకు పీఎఫ్‌తో పాటు పెడింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీను, కల్యాణ్, ప్రశాంత్, ఖాసీంబీ, రాజేశ్వరి పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

మధిర: అన్నం పరబ్రహ్మ స్వరూపం అని, అన్ని దానాల కంటే అన్నదానం మిన్న అని సత్య సాయి సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ కోనా మోహన్‌రావు, శివాలయం కమిటీ మాజీ చైర్మన్ ములకలపల్లి మోహన్ రావు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మెయిన్ రోడ్డులో వేంచేసి ఉన్న వినాయకుడి గుడి వద్ద దాతల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదల ఆకలి తీర్చేందుకు దాతల సహకారంతో అన్నదానాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని తెలిపారు. పేదల కోసం ప్రతి బుధవారం వినాయకుడి గుడి వద్ద అన్నదానం ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను వారు అభినందించారు.

నేడు సీపీఎం మండల కమిటీ సమావేశం

మధిరరూరల్: మధిర పట్టణంలోని సీపీఎం కార్యాలయం బోడెపూడి భవన్‌లో ఈ నెల 11న ఉదయం 9:30 గంటలకు సీపీఎం మండల కమిటీ సమావేశం జరుగుతుందని ఆ పార్టీ మండల కార్యదర్శి మందా సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ మండల కమిటీ సభ్యులు ఈ సమావేశానికి సకాలంలో హాజరు కావాలని కోరారు.

కాంగ్రెస్‌ను గెలిపించండి..

కల్లూరురూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరారు. కల్లూరు మండలంలోని పేరువంచ, ముగ్గువెంకటాపురం, కొర్లగూడెం గ్రామాలలోని ఉపాధిహామీ పథకం కూలీలను కలుసుకొని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ పేదవాడికి న్యాయం జరగాలంటే రాష్ట్రంలో మాదిరిగానే.. కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని, రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. కాంగ్రెస్ విజయం కోసం ప్రతీ కార్యకర్త కష్టపడాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం ఆరు గ్యారెంటీ స్కీమ్‌లలో భాగంగా మహిళలకు నెలకు రూ.2,500లు పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఉపాధిహామీ కూలీలకు సంవత్సరానికి రూ.12వేలు ఇవ్వటం జరుగుతుందన్నారు. నేను గెలిచిన మూడునెలల్లోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.100కోట్లు నిధులు తెచ్చానన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు దండు ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు పరిమి భరత్, ఎస్‌కె తురబ్ అలీ, ఇనుముల రాము, పాపబత్తిని నగేష్, ఎస్.శ్రీకాంత్ పాల్గొన్నారు.



పేరువంచలో కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

ముస్లింలకు ఇఫ్తార్ విందు..

సత్తుపల్లిటౌన్: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా సత్తుపల్లిలోని జామె మసీద్‌లో ముస్లింలకు ఎమ్మెల్యే మట్టా రాగమయి బుధవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. స్వయంగా ఆమె వడ్డించారు. ముందుగా దువ్వాలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎండి కమల్‌పాషా, ఎస్‌కె మౌలాలీ, ఎస్‌కె రఫీ, ఎండి ముకరం హుస్సేన్, రియాజ్, షాకీర్ పాల్గొన్నారు.

నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారంలో..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణంలోని శ్రీకోదండ రామాలయం ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం 30 మంది ట్రస్ట్ సభ్యులతో జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా చలసాని సాంబశివ రావు, గౌరవ సలహాదారులుగా కొత్తూరు ప్రభాకర్ రావు, గుడిమెట్ల గాంధీ, కోరుకొండ వెంకటేశ్వర రావు, అధ్యక్షుడిగా కొత్తూరు సత్యనారాయణ, కార్యదర్శిగా అనుమోలు సురేష్‌కుమార్, కోశాధికారిగా తోట రమేష్‌బాబుతో పాటు 30 మంది సభ్యులను భక్తజనుల సాక్షిగా ఆలయ పూజారి ఆంజనేయులుతో పాటు కుమారుడు ఫణి సభ్యులతో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రమాణ స్వీకారం చేయించారు.

ఓటు హక్కుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

మధిర: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని మహదేవపురం, ఇల్లూరు గ్రామాల్లో బుధవారం ఉపాధి కూలీలను కలిసి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రలోభాలకు గురిచేయడం, ఓటర్‌కి నగదు పంపిణీ తదితర విషయాలపై సి విజిల్ యాప్ ద్వారా ఏ విధంగా ఫిర్యాదు చేయాలనే విషయాల గురించి వివరించారు. వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేకంగా ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ముగిసిన కబడ్డీ పోటీలు

కారేపల్లి: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం రాత్రితో ముగిశాయి. కొమ్ముగూడెం పోలేరమ్మ తల్లి ఆలయ కమిటీ, ఆదివాసీ యూత్ ఆధ్వర్యంలో జరిగిన కబడ్డీ పోటీల్లో ఫైనల్ మ్యాచ్‌లో కొమ్ముగూడెం, పుతానితండా జట్లు పోటీ పడగా.. కొమ్ముగూడెం జట్టు విజేతగా నిలిచింది. రన్నరప్‌గా పుతానితండా జట్టు, తృతీయస్థానంలో గురిమెళ్ల జట్టు, నాలుగో స్థానంలో సూరారం, ఐదో స్థానంలో గుంపెళ్లగూడెం జట్లు నిలిచాయి. విజేతగా నిలిచిన కొమ్ముగూడెం జట్టుకు ఖమ్మంకు చెందిన ప్రైవేట్ వైద్యశాల శశి హాస్పిటల్ మేనేజర్ దమ్మాలపాటి శ్రీనివాసరావు రూ.20వేలు, షీల్డు అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన పుతాని తండా జట్టుకు, ఎర్రబోడుకు చెందిన శ్రీ సాయి బ్రిక్స్ అధినేత పాకాలపాటి దామోదర్ రూ.16వేలు, షీల్డు, మూడో బహుమతి సీహెచ్.నాగేంద్రబాబు రూ.12వేలు, షీల్డు, నాలుగో బహుమతి వర్సా చంద్రశేఖర్ రూ.8వేలు, షీల్డు, ఐదో బహుమతి పెనక రామారావు రూ.5వేలు, షీల్డులను అందజేశారు. కార్యక్రమంలో ముక్తి సందీప్ ప్రతిభ చూపిన క్రీడాకారులకు జ్ఞాపికలను వితరణగా అందజేశారు. కార్యక్రమానికి ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బండ్ల రాంబాబు హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. నిర్వాహక కమిటీ సభ్యులు కల్తి రాంప్రసాద్, కల్తీ కిరణ్; కల్తీ లక్ష్మణ్, వర్సా చంద్రశేఖర్, కాటేపల్లి కార్తీక్, ముక్తి రాంప్రసాద్‌లను అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు భద్రమ్మ, ఆదినారాయణ, సత్యనారాయణ, రామబ్రహ్మం, పోతయ్య, శ్రీను, పెనక కుమార్ బాబు, వర్సా సీతారాములు, పుల్లారావు, సింగ్ వెంకన్న, కోచ్‌లు ముక్తి రాంప్రసాద్, ముక్తి బద్రి, బాలాజీ, నరసింహారావు, హర్ష, వ్యాయామా ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కొమ్ముగూడెం జట్టుకు ప్రథమ బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామంలోని శ్రీకోటమైసమ్మతల్లి బ్రహ్మోత్సవాలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమైయ్యాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఉత్సవాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి తల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాలు ఈ నెల 10 నుంచి 12వ తారీకు వరకు నిర్వహించడం జరుగుతుంది. తొలిరోజు ఆలయ అర్చకుడు కొత్తలంక కైలాసశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మంగళ తోరణములు, విఘ్నేశ్వర పూజ, అఖండ దీపాస్థానము, దేవతా హోమములు, గౌరీ పాశుపత హోమము, నీరాజన మంత్రపుష్పములు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం శ్రీ నారాయణ లోద్, ఏపీఎల్ వెజిటే బుల్స్ ఇల్లందు వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ కె.వేణుగోపాలాచార్యులు, పర్సాట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు-విజయలక్ష్మి దంపతులు, ఆలయ సిబ్బంది మూడ్ మోహన్‌చౌహన్, పర్సా సాయి తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలను ప్రారంభిస్తున్న పర్సా ట్రస్టు చైర్మన్ పర్సా పట్టాభిరామారావు

పాఠశాలల్లో కంప్యూటర్ డిజిటల్ ల్యాబ్‌లు

పెనుబల్లి: మండలంలోని వీయంబంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, టేకులపల్లి మోడల్ స్కూళ్లలో బుధవారం కంప్యూటర్ డిజిటల్ ల్యాబ్‌లను వీజీఎఫ్ ట్రస్ట్ డైరెక్టర్ ఆళ్ల సూర్యనారాయణరావు ప్రారంభించారు. వీజీఎఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోడ్‌హోప్ గ్లోబల్ చేసిన రూ.6 లక్షల సహాయంతో ఈ ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీయంబంజర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9 కంప్యూటర్లు, ఒక ప్రింటర్, టేకులపల్లి మోడల్ స్కూల్‌లో 3 కంప్యూటర్లు, ఒక ప్రింటర్, కోంద్రుపాడు ఉన్నత పాఠశాలలో 3 కంప్యూటర్లు, ఒక ప్రింటర్ ల్యాబ్ ప్యాకల్టీకి అందజేశారు. వీజీఎఫ్ ట్రస్ట్ సభ్యులు బి.శ్రీనివాసరావు, టి.నాగేశ్వరరావు, వై.కోటేశ్వరరావు, జి.రామారావు, ప్రధాన ఉపాధ్యాయుడు సత్యనారాయణ, టేకులపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగరాజు, కేజీబీవీ ఏఎస్ఓ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు



గోకినేపల్లిలో బోరువద్ద మోటారును పరిశీలిస్తున్న అధికారులు

ముదిగొండ: గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి అన్నారు. బుధవారం మండలంలోని గోకినేపల్లిలో తాగునీటి సరఫరా చేసే బోరుకు నూతన విద్యుత్ మోటారు ఏర్పాటును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి పైపులైన్‌లు లీకవ్వకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శి సతీష్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పెగళ్లపాటి సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయరాజు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సత్కారం

నవోదయలో సీటు సాధించిన విద్యార్థికి..



పవన్‌తేజ, ఆయన తల్లిదండ్రులను సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

వైరా: ఇటీవల విడుదల అయిన నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి సీటు సాధించిన వైరాకు చెందిన కుదురుపాక పవన్‌తేజను బుధవారం వైరా మండల నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. స్థానిక కేఎంఆర్ హాస్పిటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యుడు డాక్టర్ కె.మోహనరావు, తెలంగాణ నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గజ్జెల వెంకన్న, ప్రధాన కార్యదర్శి దేవరకొండ వెంకన్నలు పవన్‌తేజతో పాటు ఆయన తల్లిదండ్రులను శాలువ పూలమాలతో సత్కరించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాచర్ల రాంబాబు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు కుదురుపాక శ్రీహరి, గజ్జెల రామకృష్ణ, శ్రీరంగం, శ్రీనివాసరావు, నరసింహారావు, శంకర్, శ్రీను, సతీష్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొలువులు సాధించిన ఇరువురికి..

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన తోట కృష్ణారావు, సూదా బ్రహ్మేంద్రరావులు గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించారు. దీంతో బుధవారం వారిని సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొంతు రాంబాబు, పులి వెంకటనరయ్య, ఎస్.మోహన్‌రావు, డైరెక్టర్ గోవింద్ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రమేష్, కృష్ణయ్య, నరసింహారావు, రామయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి చట్టం రక్షణకు ఉద్యమించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్: ఉపాధిహామీ చట్టం రక్షణకు ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తాళ్లమడ గ్రామంలో ఉపాధిహామీ కూలీల పని ప్రదేశాన్ని సందర్శించి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామి పనిని ఎత్తివేయడానికి అనేక కుట్రలు పన్నుతుందని, భారీగా నిధులకు కోత విధించిందన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించి, రోజుకూలీ రూ.600 లివ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు సనందన్‌రావు, వినోద్, వెంకటేశ్వరరావు, రాజేష్, తడికమళ్ల నాగమ్మ, సాధు చెల్లెమ్మ, వరలక్ష్మి, ప్రసాద్, రాములు పాల్గొన్నారు.

ఏటీఎం సేవలను సద్వినియోగం చేసుకోండి

కారేపల్లి: కారేపల్లిలోని స్టేషన్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీఎంను ప్రజావైద్యుడు సామినేని రాఘవులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకుల్లో ఉండే రద్దీ కారణంగా ఖాతాదారులు లావాదేవీలు జరపడంలో ఇబ్బందులు ఎదుర్కొంటారని, దీంతో సమయం వృథా అవుతుందని, ఏటీఎం సేవలను వినియోగించుకోవటం వలన లావాదేవీలను సులభంగా జరుపుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో కారేపల్లి ఎస్‌బీఐ సిబ్బంది గౌరవ్‌శుక్లా, దీనారావు, ప్రభాకర్, గ్రామస్తులు సూర్యదేవర వెంకటేశ్వర్లు, యర్రా చక్రపాణి, శివాజీ, ఓరుగంటి రాజు, చిరునోముల మాధవ్, మైలవరపు సాయిభరత్, చంద్రగిరి ప్రశాంత్, వినీల్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



స్టేషన్‌రోడ్డులో ఏటీఎంను ప్రారంభిస్తున్న రాఘవులు

రంజాన్ తోఫా పంపిణీ

కొణిజర్ల/సత్తుపల్లిరూరల్: మండలంలోని తనికెళ్లలో గడల సీతారామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో గడల సీతారామయ్య కుమారుడు గడల భాస్కర్ ముస్లింలకు రంజాన్ సరుకులు పంపిణీ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన సీపీఐ నాయకులతో కలిసి ముస్లిం మహిళలకు అందజేశారు. అదే విధంగా సత్తుపల్లిలో ముస్లింలకు అమ్మా ఆషాఖాన్ చారిటబుల్‌ట్రస్ట్ నిర్వాహకురాలు పఠాన్ ఆషాఖాన్ బుధవారం నూతన వస్త్రాలు, రంజాన్ తోఫా పంపిణీ చేశారు. అదేవిధంగా నెలరోజులుగా ఉపవాస దీక్షలు చేస్తున్న సత్తుపల్లి, వేంసూరు మండలాల్లోని పది గ్రామాలకు చెందిన ముస్లింలకు ఆయా మసీదులకు వెళ్లి స్వయంగా తయారు చేసిన ఇఫ్తార్ అందించారు. నిరుపేద వికలాంగులకు నిత్యావసర సరుకులు అందజేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సీపీఐ నాయకులు యాసా వెంకటేశ్వరరావు, పీవీరావు, లేడిబోయిన గోపాలరావు, గడల శ్రీను, పిన్నం పుల్లయ్య, ముస్లిం పెద్దలు షేక్ రంజాన్ పాల్గొన్నారు.



ముస్లింలకు నూతన వస్త్రాలు, సామగ్రి అందజేస్తున్న పఠాన్ ఆషాఖాన్

రంజాన్ సందడి..

కొనుగోళ్లతో మార్కెట్ రద్దీ..



గాజుల దుకాణంలో..

సత్తుపల్లిటౌన్: నెలవంక కనిపించటంతో ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని గురువారం జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు రంజాన్ పండుగకు సన్నద్ధమయ్యారు. నూతన వస్త్రాలు, అత్తరు, కిరణా, సేమియాలు కొనుగోళ్లకు మార్కెట్ రద్దీగా మారింది. మహిళలు, చిన్నారులు మెహిందీలు పెట్టుకుంటూ ఇళ్లల్లో సందడిగా వాతావరణం నెలకొంది. దుకాణాలన్నీ పండుగా హడావుడితో రద్దీగా మారాయి.



అత్తరు కొనుగోలు చేస్తున్న దృశ్యం

ఒలంపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: ఇండియన్ బ్రిలియంట్స్ ఆధ్వర్యాన సత్తుపల్లి టాలెంట్ స్కూల్‌లో నిర్వహించిన క్రియేటివ్ పెయింటింగ్ ఒలంపియాడ్ పోటీలో 32 మంది విద్యార్థులకు గోల్డ్‌మెడల్, ప్రశంసపత్రాలు అందుకున్నారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐఎస్‌టీఎస్ఓ ఫలితాల్లో..

మధిరరూరల్: ఐఎస్‌టీఎస్ఓ పరీక్ష ఫలితాల్లో మధిర పట్టణానికి చెందిన శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించి ప్రభంజనాన్ని సృష్టించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆకెళ్ల భారతి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకి బుధవారం పాఠశాలలో గోల్డ్ మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. గత ఫిబ్రవరి నెలలో జరిగిన ఐఎస్‌టీఎస్ఓ ఫైనల్ లెవెల్ పరీక్షల్లో 231 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 174 మంది విద్యార్థులు మెరిట్ సర్టిఫికెట్ సాధించి, ఆలిండియా లెవెల్‌లో మొదటి, రెండవ, నాలుగవ, ఐదవ బహుమతులు సాధించారని తెలిపారు. అంతేకాకుండా 33 మంది విద్యార్థులు కన్సోలేషన్ ప్రైజులతోపాటు 23 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని తెలిపారు.

కనీస వేతనం రూ.600 ఇవ్వాలి

కొణిజర్ల/ఏన్కూరు: ఉపాధి కూలీలకు రూ.600 దినసరి వేతనం ఇవ్వాలని ఏపీకేఏంఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల అర్జునరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తీగలబంజరలో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని ఆ సంఘం నాయకులు సందర్శించారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ కార్యదర్శి కొల్లి నాగేశ్వరరావు, సాగి అప్పారావు, సునావత్ భద్రు, బానోత్ బోడ్కా, భూలీ, రుక్మిణి, లక్ష్మి పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి



సేవలు అందిస్తున్న వైద్యురాలు వసంత

చింతకాని: దివ్యాంగ పిల్లల కోసం నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని ఫిజియోథెరపీ వైద్య సేవలు నిర్వహించి మాట్లాడారు. మండలంలో పాక్షిక పక్షవాతం, ఇతర శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లలకు ఉచితంగా సేవలు అందిస్తామన్నారు. పాక్షిక అంగవైకల్యం కల్గిన పిల్లలకు అవసరమైన సహాయ పరికరాలను అందజేయటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు కేఎస్ కృష్ణారావు, భూక్యా దస్లీ, భవిత కేంద్రం సంరక్షురాలు అరికొట్ల లలితకుమారి, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ

పెనుబల్లి: సప్తపది లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వీయంబంజర్ రింగ్ సెంటర్‌కు నాలుగువైపులా జాతీయ రహదారుల పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారులకు బుధవారం గొడుగులు వితరణగా అందజేశారు. వేసవి కాలం ఎండ తీవ్రత నుంచి కాపాడుకునేందుకు చిరు వ్యాపారులకు రూ.6 వేల విలువైన 5 గొడుగులను వితరణగా అందజేసినట్లు క్లబ్ అధ్యక్షులు పోట్రు వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ ఎస్‌కె అబ్దుల్ సలాం, సెక్రటరీ సుంకర సత్యనారాయణ, ట్రెజరర్ పొన్నగంటి వినాయక ప్రసాద్, నాళ్ళ జయరాం, శ్రీధరాల సుబ్బారావు, అనుమోలు సాంబశివరావు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

చింతకాని: చెరువు పూడిక మట్టి కావాల్సిన రైతులు ముందుగా గ్రామ పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారికి దరఖాస్తు చేసుకోవాలని ఇరిగేషన్ జేఈ సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులో నమోదు చేయబడిన పాస్‌బుక్ వివరాల ఆధారంగా రైతుకు ఎకరానికి 30 ట్రిప్పుల చొప్పున ఇరిగేషన్ మండల శాఖ ద్వారా మధిర డివిజన్ ఈఈ అనుమతి ఇవ్వటం జరుగుతుందని, తద్వారా తమ పంట పొలాల్లో మాత్రమే నింపుకోవాల్సి ఉంటుందన్నారు.

ల్యాప్‌టాప్ వితరణ



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: వైరా గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో బుధవారం వైరాకు చెందిన బీటెక్ విద్యార్థిని పణితి నేహశ్రీకి ఉన్నత చదువులు నిమిత్తం ల్యాప్‌టాప్ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీ కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లయన్స్‌క్లబ్ విద్యానిధి ట్రస్టు ద్వారా ఎందరో నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువుల నిమిత్తం సాయం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఎంటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, ఆర్‌సీ లగడపాటి ప్రభాకర్‌రావు, తోటకూర శ్రీకాంత్, గంగవరపు కిషన్‌రాయ్, ఉయ్యూరి రామకృష్ణ, జాలా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

రైతులకు రుణాలు ఇప్పించాలి

తల్లాడ: సహకార సంఘాల్లో తీసుకున్న రుణాలు రీషెడ్యూల్ చేసి తిరిగి కొత్త రుణాలు ఇప్పించాలని తల్లాడ మండల కాంగ్రెస్ నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విన్నవించుకున్నారు. బుధవారం గండుగులపల్లిలోని తుమ్మల గృహంలో వారు కలిసి విన్నివించారు. వర్షాలు సకాలంలో సరిగా కురవకపోవడంతో నష్టపోయారని, ఈ సమయంలో రైతులకు కొత్త రుణాలు ఇప్పించి ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల స్పందిస్తూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తుమ్మలను కలిసిన వారిలో మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి, పగడాల లచ్చిరెడ్డి, ఎంపీటీసీ కొమ్మినేని ప్రభాకర్‌రావు, పోట్రు శరత్‌బాబు, మూకర ప్రసాద్, సామినేని రామప్పారావు, మర్సకట్ల బాబురావు, యుగంధర్, జగన్‌మోహన్‌రావు, వంకాయలపాటి వెంకటయ్య పాల్గొన్నారు.



మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్ నాయకులు